క్లుప్తంగా

వరి కోతలు వాయిదా వేసుకోవాలి



గూడూరు: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి కోతలు వాయిదా వేసుకోవాలని ఎంఏవో కె.ఆంజనేయ కుమార్ రైతులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండలంలోని లేళ్ళగరువులో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో కోస్తా ప్రాంతంలో వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఫలితంగా పంటలు తడిసి దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పంటల కోతను వాయిదా వేసుకోవాలని కోరారు. ఇప్పటికే కోసిన పంటను టార్పాలిన్ల సాయంతో తడవకుండా జాగ్రత్త చేసుకోవాలని సూచించారు.

వైభవంగా పుష్పాభిషేకం



భావదేవరపల్లి(నాగాయలంక): కార్తిక అమావాస్యను పురస్కరించుకుని ఆఖరి రోజైన ఆదివారం స్థానిక అన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో విశ్వేశ్వర స్వామి, వినాయకస్వామికి విశేష పుష్పాభిషేకం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు కొల్లిపర సుబ్బారావు ఆధ్వర్యంలో వంద కేజీల పూలతో అభిషేక నివేదన అనంతరం అలంకరించారు. వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు పర్యవేక్షించారు.

సుబ్బారాయుడి ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం భక్తజనంతో పోటెత్తింది. కార్తికమాసం చివరి ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో జనసంద్రంగా మారింది. నాగపుట్ట, నాగమల్లివృక్షం, పొంగలిశాల వద్ద రద్దీ ఏర్పడింది. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి షష్టి మహోత్సవాలు

పెడన: పట్టణంలోని బంటుమిల్లి రోడ్డు వ్యవసాయమార్కెట్ యార్డు పక్కనే ఉన్న చిట్టూరి మాధవరావు తోటలోని కాత్యాయనీ దేవి అమ్మ వారి ఆలయంలో తొమ్మిదవ షష్టి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమై ఏడో తేదీతో ముగుస్తాయని నిర్వాహకులు చిట్టూరి పశుపతినాథ్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం అభిషేకాలు కుంకుమ పూజలు, సాయంత్రం విశిష్ట మల్లెల పుష్పార్చన, లలిత పారాయణం నిర్వహిస్తామన్నారు. పెడన పట్టణ, పరిసర ప్రాంత భక్తులందరూ 'కాత్యాయని' అమ్మవారిని దర్శించుకుని మంత్రపుష్ప తీర్థప్రసాదములు స్వీకరించాలని కోరారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో 'మీకోసం'

బంటుమిల్లి: 'మీ కోసం' కార్యక్రమం ఇక నుంచి తహసీల్దారు కార్యాలయంలోనే జరుగుతుందని, ఆర్జీదారులు ఎవరైనా ఏ శాఖకు చెందిన వారయినా తహసీల్దారు కార్యాలయంలోనే అందజేయాలని బంటుమిల్లి తహసీల్దార్ భరత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్జీదారులు ఈ విషయాన్ని తెలుసుకుని ఇతర కార్యాలయాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేవలం తహసీల్దారు కార్యాలయంలోనే ఆర్జీలు అందజేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు కూడా తహసీల్దారు కార్యాలయంలోనే ఉంటారని, వారికి సంబంధించిన ఆర్జీలను తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు.

నేడు రంగులకు బయల్దేరనున్న పైడమ్మ

పెడన: స్థానిక పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 2వ తేదీన పైడమ్మ అమ్మవారు ఉత్సవ విగ్రహం మచిలీపట్నంలో రంగుల కోసం వెళ్లనుంది. సోమవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని ఊరేగింపుగా మచిలీపట్నం తీసుకువెళ్లనున్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరగనున్న పైడమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ప్రతి ఏటా అమ్మవారు పాడ్యమి రోజున తరలి వెళ్లడం ఆనవాయితీ. తిరిగి అమ్మవారు ఈ నెల 13, 14 తేదీలలో బయల్దేరి ఆలయానికి చేరుకోన్నట్లు ఆలయ ఈవో టీవీవీ మోహనరావు తెలిపారు.

నెరవేరని తడి,పొడి చెత్త లక్ష్యం

- తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్న కార్మికులు
- డంపింగ్‌యార్డుకు చేరేసరికి అంతా ఒక్కటే..
- కంపోస్టు యార్డు లేకుండానే తడి, పొడి చెత్త అంటూ హడావుడి



క్లాప్ ఆటోలో చెత్తను కంపాక్టర్‌లో నింపుతున్న దృశ్యం



గృహాల నుంచి తడి, పొడి చెత్తను సేకరిస్తున్న కార్మికులు

మచిలీపట్నంటౌన్: నగరంలో తడి, పొడి చెత్త సేకరణ వృధా ప్రయాసగా మారింది. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచన మేరకు నగర వాసులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని స్థానిక అధికారులు ప్రచారం చేశారు. అయితే వాస్తవం ఇందుకు విరుద్ధంగా ఉంది. నగరవాసులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా తీసుకువచ్చి పుష్‌కాట్‌తో వచ్చిన కార్మికులకు అందజేస్తున్నారు. వారు కూడా విడివిడిగానే డ్రమ్ముల్లో వేస్తున్నారు. తీరా ఈ చెత్తను డంపింగ్ యార్డుకు చేరవేసే ట్రాక్టర్లు, క్లాప్ ఆటోలు మాత్రమే రెండింటినీ కలిపి లోడ్ చేసుకుని వెళుతున్నాయి.

వాస్తవానికి దూరంగా..

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి వాటి ద్వారా నగరపాలక సంస్థకు ఆదాయాన్ని సమకూర్చాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చేస్తున్న ప్రయత్నం వాస్తవ రూపం దాల్చటం లేదు. పొడి చెత్తను కొంతమేర గుంటూరులోని పవర్ ప్లాంట్‌కు తరలించి ఆదాయాన్ని సమకూరుస్తున్నారు. అయితే తడిచెత్త ద్వారా కంపోస్టు తయారు చేసి తద్వారా ఆదాయాన్ని సమకూర్చాలనే లక్ష్యం మాత్రం ఇక్కడ నెరవేరటం లేదు. తడి చెత్త నుంచి సంపద సృష్టించేందుకు అవసరమైన కంపోస్టు యార్డు నిర్మాణమే జరగలేదు. యార్డు నిర్మించి విడిగా సేకరించిన తడి చెత్త ద్వారా ఆదాయం సంపాదించవచ్చు. అయితే నగరపాలక సంస్థ అధికారులు దీనికి విరుద్ధంగా వ్యవహరించటం వల్ల ఉన్నతాధికారులను తప్పుదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.

రోజూ 84 టన్నుల చెత్త సేకరణ..

నగరంలోని 50 డివిజన్ల నుంచి ప్రతిరోజూ 9 ట్రాక్టర్లు, 41 క్లాప్ ఆటోల ద్వారా 84 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. దీనిలో 54 టన్నులు తడి, 30 టన్నుల పొడి చెత్త ఉంటోంది. క్లాప్ ఆటోల ద్వారా సేకరించిన చెత్తను మాత్రమే గుంటూరు పవర్ ప్లాంట్‌కు పంపిస్తున్నారు. క్లాప్ ఆటోల ద్వారా సేకరించన చెత్తను హైడ్రాలిక్ పద్ధతి ద్వారా రెండు కంపాక్టర్లలో నేరుగా నింపి తరలిస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా వచ్చే చెత్తను డంపింగ్‌యార్డులో పోసి తగులబెడుతున్నారు.

ప్రజలు సహకరిస్తున్నా..

నగరంలోని చాలా మంది ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా ఇస్తున్నప్పటికీ దీనిని సద్వినియోగం చేసుకునే దిశగా నగరపాలక సంస్థ అధికారులు అడుగులు వేయటం లేదు. పొడి చెత్తను పవర్ ప్లాంట్‌కు పంపి కొంత ఆదాయాన్ని సమకూరుస్తున్నారు. కానీ తడి చెత్త ద్వారా ఆదాయాన్ని సంపాదించే ప్రయత్నాలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. తడి చెత్త ద్వారా కంపోస్టు ఎరువు తయారీకి సంబంధించి ఎలాంటి ముందడుగు వేయకుండానే సేకరించటంలోని ఆంతర్యం ఏమిటోనని నగరవాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

కంపోస్టుయార్డు నిర్మాణానికి చర్యలు



నగర ప్రజల నుంచి సేకరిస్తున్న తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారీకి అవసరమై కంపోస్టు యార్డు ఏర్పాటుకు కలెక్టర్ డీకే బాలాజీ ప్రత్యేక చొరవతో చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం సేకరిస్తున్న తడి, పొడి చెత్తను గుంటూరు పవర్ ప్లాంట్‌కు పంపుతున్నాం. కంపోస్టుయార్డు ఏర్పాటైతే తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీ జరుగుతుంది. నగర పాలకసంస్థకు ఆదాయం వస్తుంది.

– సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, కమిషనర్, మచిలీపట్నం

రోడ్డు ప్రమాదంలో మృతులకు అంత్యక్రియలు

శవపేటికలను మోసిన పేర్ని కిట్టు



రోడ్డుప్రమాదంలో మృతుల శవపేటిక మోస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: కంకిపాడు వద్ద జాతీయ రహదరిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అసువులు బాసిన స్థానిక బలరామునిపేటకు చెందిన మృతుల అంతిమయాత్ర ఆదివారం జరిగింది. ఈ అంతిమయాత్రలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. మృతులు చీలి ప్రభు, భాను, చింతా రవిల పార్థివ దేహాల శవపేటికలను మోస్తూ అంతిమయాత్రలో జోరు వర్షంలో పేర్నికిట్టు పాల్గొన్నారు. చీలి ప్రభు, భానుల ఖననం బైపాస్ రోడ్‌లోని శ్మశాన వాటికలో జరగ్గా, చింతా రవి ఖననం ఇంగ్లిషు చర్చి ఆవరణలో జరిగింది. చీలి భాను మరణవార్త విని గుండెపోటుతో మృతి చెందిన ఆయన తల్లి సుధారాణి అంతిమయాత్ర, ఖననం కార్యక్రమంలో కూడా పేర్నికిట్టు పాల్గొన్నారు. ఉదయం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం త్వరితగతిన జరిగేలా పేర్నికిట్టు పోలీసులు, వైద్యులతో సంప్రదింపులు జరిపారు. ఆయన వెంట నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, 42వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చీలి చక్రపాణి ఉన్నారు.

ఇది బాదుడే బాదుడు కాదా బాబూ?

- రూ.15,485 కోట్లు విద్యుత్ చార్జీలు పెంచారు
- మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ సింహాద్రి రమేష్ బాబు

అవనిగడ్డ: గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనను బాధుడే బాదుడు అని విమర్శలు చేసిన కూటమి ప్రభుత్వం రూ.15,485 కోట్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై బాదుడే బాదుడు కార్యక్రమంతో నాంది పలికిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ కన్వీనర్ సింహాద్రి రమేష్ బాబు ఎద్దేవా చేశారు. అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. కక్ష సాధింపు రాజకీయాలు, గొడవలు రేపడం మానుకోవాలని సింహాద్రి హితవు పలికారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం చేతగాక డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని సింహాద్రి విమర్శించారు. వర్షాలకు తడిసిన, దెబ్బతిన్న పంటను పరిశీలించి షరతులు లేకుండా కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తే చోటా నాయకులను వేర్వేరు ప్రాంతాలకు పంపించి ఆహా ఓహో అంటూ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారన్నారు. ధాన్యం కనీస మద్దతు ధర బస్తా రూ.1725 ఉంటే రూ.1450 లోపు కొనుగోలు చేస్తున్నారని, దీని వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. ఏటిమోగ- ఎదురుమొండి వారధికి గతంలోనే నిధులు మంజూరైతే ఎందుకు పనులు చేయించడం లేదని సింహాద్రి ప్రశ్నించారు. అవనిగడ్డ డంపింగ్‌యార్డు తరలింపు కోసం స్థలాలు చూస్తే మీ వారితో ధర్నాలు చేయించి ఇప్పుడెందుకు పట్టించుకోవటంలేదన్నారు. అవుట్ ఫాల్ స్లూయిజ్ లకు రూ.1.20 కోట్లు నిధులు విడుదల చేయించినట్టు బుద్ధప్రసాద్ గొప్పలు చెప్పుకుంటున్నారని, అవి ఐదు పనులకు కలిపి మంజూరైన నిధులనే విషయం మరువరాదన్నారు. ఈ ఆరు నెలల కాలంలో మీరు చేసిందేమిటో, జగన్ మోహన్ రెడ్డి చేసిందేమిటో ఇప్పటికే ప్రజలకు అర్థమైందన్నారు. మీ హామీలు అమలు చేయకపోవడం, మీరు చెప్పే అబద్ధాలను ప్రజలకు తెలియజేస్తున్నందున వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా నిర్వాహకులపై కక్షగట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రైతులను నట్టేట ముంచిన 22 (ఏ) జీవో రద్దు చేసి రైతులకు మేలు చేసే పరిపాలన జగన్ మోహన్ రెడ్డి అందిస్తే, అధికారంలోకి రాగానే పాత జీవోను అమలు చేసి మోసం చేసింది మీ ప్రభుత్వం కాదా అని సింహాద్రి ప్రశ్నించారు. నియోజకవర్గంలో జూదాలు, కోడి పందేలు, ఇసుక, బుసక, పేదల బియ్యం అక్రమ రవాణా బుద్ధ ప్రసాద్ కుటుంబ సభ్యుల కనుసన్నల్లోనే జరుగుతుందని ఆరోపించారు. ఎంపీపీ తుంగల సుమతీ దేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్ బాషా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజుల జైగోపాల్, మండల యూత్ కన్వీనర్ చింతలపూడి బాలు పాల్గొన్నారు.

సందడిగా కార్తిక వనసమారాధన



నడకుదురులో వనభోజనాలు చేస్తున్న ఎస్సార్ వైఎస్పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు



మచిలీపట్నంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

చల్లపల్లి(అవనిగడ్డ): కార్తిక మాసం చివరి రోజు సందర్భంగా చల్లపల్లి మండల పరిధిలోని నడకుదురులో పృథ్వీశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. చల్లపల్లిలోని ఎస్సార్ వైఎస్పీ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ తగిరిశ సాంబశివరావు మాష్టారు ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు కార్తిక వనసమారాధన కార్యక్రమంలో ఉత్సాహం పాల్గొన్నారు. తొలుత ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ గతాన్ని తలుసుకుంటూ ఆనందంగా గడిపారు. ఉసిరి వనంలో ప్రత్యేకంగా వేసిన పందిళ్ల నడుమ సహపంక్తి భోజనాలు చేశారు. సుమారు 150 మందికి పైగా ఎస్సార్ వైఎస్పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు. తగిరిశ సాంబశివరావు మాష్టారు దంపతులను ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. చివరిగా ఒకరికి ఒకరు వీడ్కోలు చెప్పుకున్నారు.

మచిలీపట్నంటౌన్: నగరంలో ఆదివారం యాదవుల కార్తిక వన సమారాధన నిర్వహించారు. నగరం, పరిసర ప్రాంతాలకు చెందిన యాదవులు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ మచిలీపట్నం యాదవ సంఘాలతో తన కుటుంబానికి సుదీర్ఘ అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. తన తండ్రి పెదరెడ్డియ్యకు తనకు రాజకీయంగా అండగా నిలిచారన్నారు. వీరి రుణం తీర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నానన్నారు. మానవ సంబంధాలు స్వార్థపూరితమై బలహీన పడిన పరిస్థితుల్లో శ్రీ కృష్ణుడి ఆశీస్సులతో యాదవ కుటుంబాలు అన్ని రంగాల్లోనూ పైకిరావాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పార్థసారథిని నిర్వాహకులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం అందరూ సహపంక్తి భోజనాలు చేశారు.

డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కోడూరు: పలు మండలాల్లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టుల నియామకానికి తహసీల్దార్‌లు నోటిఫికేషన్ జారీ చేశారు. కోడూరు మండలంలో ఖాళీగా ఉన్న రెండు రేషన్ షాపుల్లో డీలర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనునాయక్ ఆదివారం తెలిపారు. కోడూరు పంచాయతీ పరిధిలోని నరసింహపురం గ్రామంలో ఉన్న రేషన్ షాపు నంబర్ 0636006, విశ్వనాథపల్లి పంచాయతీలోని కుమ్మరిపాలెం గ్రామంలో ఉన్న రేషన్ షాపు నంబరు 0636025కు డీలర్ల నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ రెండూ ఎస్సీ రిజర్వేషన్‌కు కేటాయించబడ్డాయన్నారు. అసక్తిగల వారు ఈనెల 14వ తేదీ లోపు బందరు ఆర్డీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పెడన: పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాలకు డీలర్లను నియమించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెడన పట్టణంలో 6, 7, 8 వార్డులకు ఉన్న దుకాణం (ఎస్సీ), 1, 2వ వార్డుల దుకాణం (ఈడబ్ల్యూసీ), 16, 17, 18 వార్డుల దుకాణం(ఎస్టీ), 10, 11వ వార్డుల దుకాణం (ఓసీ), గ్రామీణ ప్రాంతాల్లో గురువిందగుంట (ఎస్సీ), ఉప్పలకలువగుంట (ఎస్టీ), చెన్నూరు (ఓసీ, ఓపెన్ కాంపిటిషన్), కొంగంచర్ల (ఓసీ)లకు ఖాళీలున్నాయని, వాటి రిజర్వేషన్ల ప్రకారం అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఇతర వివరాలు మండల తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బంటుమిల్లి: మండల పరిధిలోని రెండు రేషన్ దుకాణాలకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దారు భరత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బంటుమిల్లి (ఓసీ), మణిమేశ్వరం (బీసీఏ) దుకాణాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండలం నిమ్మగడ్డ గ్రామంలోని 0632028 నంబర్ చౌక ధరల దుకాణ డీలర్ నియామకానికి నిరుద్యోగులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చల్లపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ జి.శ్రీలత ఆదివారం తెలిపారు. దరఖాస్తుదారులకు ఈ నెల 20న రాత పరీక్ష, 23న మౌఖిక పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షలు జరిగే ప్రదేశం హాల్ టిక్కెట్‌లో ఉంటుందన్నారు. గంటన్నర పాటు జరిగే రాత పరీక్ష 80 మార్కులకు నిర్వహిస్తారని తహసీల్దార్ తెలిపారు.

మోపిదేవి: పెదకళ్లేపల్లి చవక ధరల దుకాణం నంబర్ 633023కు డీలర్‌షిప్‌నకు అర్హులైన బీసీ బీ నిరుద్యోగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. ఆదివారం సాయంత్రం మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 20వ తేదీన రాత పరీక్ష, 23న మౌఖిక పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఎంపిక కాబడిన అభ్యర్థుల నియామక పత్రం 27వ తేదీన అందజేస్తామన్నారు. ఈ పరీక్షలు జరుగు స్థలం హాల్‌టికెట్‌లో తెలియజేస్తారని, గంటన్నర పాటు జరిగే ఈ రాత పరీక్ష 80 మార్కులకు నిర్వహిస్తామన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఘంటసాల: మండలంలోని లంకపల్లి రేషన్ షాపునకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ బి.విజయ్ ప్రసాద్ ఆదివారం తెలిపారు. లంకపల్లి గ్రామంలోని 631021 నంబరు రేషన్ షాపు బీసీ–సీలకు కేటాయించారన్నారు. ఇంటర్మీడియెట్ విద్యార్హత, 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు వారు అర్హులన్నారు. ఈ నెల 14వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, 20న రాతపరీక్ష, 23న మౌఖిక పరీక్ష ఉంటుంది.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



నగరంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

మచిలీపట్నంటౌన్: అంతర్జాతీయ ఎయిడ్స్ డే కార్యక్రమాన్ని లీగల్ ఎడ్యుకేషన్ అండ్ యాక్షన్ ఫర్ ది డెవలప్‌మెంట్ ఆఫ్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ సర్వజన ఆస్పత్రి నుంచి డీఎం, హెచ్‌ఓ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన ఉందని ఇది మరింత పెరగాలన్నారు. వ్యాధిగ్రస్తులతో కరచాలనం చేసినా, కలసి జీవించినా సోకదన్నారు. కేవలం లైంగిక సంబంధం, వ్యాధి గ్రస్తులకు వినియోగించిన ఇంజక్షన్ నీడిల్ ఉపయోగించటం, రక్త మార్పిడి వల్లే ఈ వ్యాధి సోకుతుందన్నారు. ఈ వ్యాధి సోకకుండా ప్రతి ఒక్కరూ సరైన పద్ధతులను పాటించాలన్నారు. సబ్‌జైల్ డెప్యూటీ సూపరింటెండెంట్ పిల్లి రమేష్, జిల్లా లెప్రసీ నివారణాధికారి వెంకట్రావు, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ మధుసూదనరావు మాట్లాడారు. ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించటంలో చొరవ చూపిన లీడ్స్ కెర్ సపోర్ట్ సెంటర్ ప్రతినిధులకు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు అందజేశారు. ప్రోగ్రాం మేనేజర్ డీ సమాదానం, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎం.అరుణ, సర్వజన ఆస్పత్రిలోని ఏఆర్టీ సెంటర్ సిబ్బంది, ఐసీటీసీ సిబ్బంది, లీడ్స్ సీఎస్సీ సిబ్బంది, గ్రేస్ నర్సింగ్ కాలేజ్ విద్యార్థినులు, ఎల్‌టీఐ ఎన్‌జీవోలు పాల్గొన్నారు.

గాలులకు నేలవాలిన వరి పొలాలు



కోడూరులో నేలవాలిన వరి పొలాలు



కృత్తివెన్ను మండలం గాంధీనగరంలో ధాన్యాన్ని తరలిస్తున్న రైతులు

వర్షంతో వరిపంటకు తీవ్ర నష్టం

కోడూరు: తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు కోడూరు, చుట్టూ పక్కల గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈదురుగాలుల తీవ్రత కూడా అధికంగా ఉండడంతో 50 శాతానికి పైగా వరిపంట నెలవాలి చాపలా మారింది. ఇప్పటి వరకు మండలంలో కేవలం ఐదు శాతం వరి పంటను మాత్రమే రైతులు యంత్రాల సహాయంతో కోత కోశారు. మిలిగిన పంటంతా ఏపుగా పెరిగి వరికోతకు సిద్ధంగా ఉంది. తుపాను ప్రభావంతో గాలులతో కూడిన వర్షం కురవడంతో వరిపంట నేలవాలిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నేలవారిన పంటపై వర్షం నీరు చేరడంతో వరిగింజలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కొనసాగుతాయని అధికారులు చెప్పడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కోడూరు, జయపురం, వి.కొత్తపాలెం, మాచవరం, లింగారెడ్డిపాలెం గ్రామాల్లో పంటకు నష్టం వాటిల్లింది. యంత్రాల సహాయంతో కోసిన ధాన్యాన్ని రైతులు రహదారుల పక్కన రాశులుగా పోయడంతో వాటిని రక్షించుకొనేందుకు నానా పాట్లు పడుతున్నారు.

ధాన్యం తరలింపు

కృత్తివెన్ను: ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వర్ష ప్రభావం పెరుగుతుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో అధిక శాతం మంది రైతులు అవకాశం ఉన్నంత వరకు యంత్రాలతో వరి కోతలు పూర్తి చేస్తున్నారు. కోత కోసిన పంటను ఎప్పటికప్పుడు మిల్లులకు తోలేస్తున్నారు.

జాతీయ పోటీలకు విద్యార్థుల ఎంపిక

గుడివాడ టౌన్: జాతీయ స్కేటింగ్ హాకీ పోటీలకు కేకేఆర్ గౌతమ్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ ఆదివారం తెలిపారు. డిసెంబర్ 5 నుండి 15వ తేదీ వరకు కొయంబత్తూర్‌లో జరగనున్న జాతీయ స్కేటింగ్ హాకీ పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొంటారన్నారు. తమ పాఠశాలకు చెందిన క్యాడెట్ బాలుర విభాగంలో డి. జోహిత్‌వర్మ, ఎం.రిషాంత్, క్యాడెట్ బాలికల విభాగంలో జి.దివిష, పి.కారుణ్య, సబ్ జూనియర్ బాలుర విభాగంలో ఎస్ఎన్ అభిలాష్, బాలికల విభాగంలో ఇ.నిఖిల పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

పమిడిముక్కల: పద్మశ్రీ ఘంటసాల– పద్మశ్రీ ఎన్టీఆర్ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం మంటాడ ప్రాథమిక పాఠశాల్లో ఘంటసాల జయంతి సందర్భంగా 102 పాటలతో సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. 15 మంది గాయకులు ఘంటసాల పాటలతో అలరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కళాపీఠం సేవలను కొనియాడారు. 102 పాటలు పాడిన కళాపీఠం వ్యవస్థాపకులు కాటూరు మురళీ కృష్ణ, గాయకులను సత్కరించారు. అనంతరం నవరసాల నందమూరి తేటగీతుల పద్యశతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, సర్పంచ్ నందమూడి వీరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, కళాపీఠం గౌరవాధ్యక్షుడు మోటేపల్లి బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల భక్తి గీతాలు

మండవల్లి: మండలంలోని అల్లినగరంలో ఆదివారం చిన్నారులు భక్తి గీతాలు ఆలపించి ఆకట్టుకుంటున్నారు. కార్తిక మాసం సందర్భంగా శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ రాజగోపాలస్వామి దేవస్థానంలో ప్రతి రోజు సాయంత్రం చిన్నారులు భక్తి గీతాలు ఆలపిస్తున్నారు.